క్లుప్తంగా

మలేరియాపై అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి కమాల్‌బాషా

జమ్మలమడుగు : పీహెచ్‌సీ సిబ్బంది కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలోకి వెళ్లి మలేరియా జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా నివారణ అధికారి డాక్టర్ కమాల్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో అధికారులు నిర్వహించిన రికార్డులు, ప్రజలకు అందుబాటులో ఉన్న మందులపై అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడుతున్నాయని తెలిపారు. కావున దోమలు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిత్య పూజయ్య, డాక్టర్ జ్యోత్స్న, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వర్ధకుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పీజీ వర్ధకుమార్‌రెడ్డికి చెన్నైలోని వేల్స్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్ తెలిపారు. వేల్స్ యూనివర్సిటీలో ఆచార్యులుగా పని చేస్తున్న డాక్టర్ ఎం.మీనా ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో టెస్ట్‌బెడ్ ఉపయోగించి ఆటోమేటిక్ మాడ్యులేషన్ క్లాసిఫికేషన్ కోసం మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ అల్గోరిథమ్‌ల అభివృద్ధి అనే శీర్షికపై వర్ధకుమార్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. ఈ పరిశోధనలో ఆధునిక వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో మాడ్యులేషన్, గుర్తింపుని వేగవంతం చేయడం, కచ్చితత్వం పెంచడం, వాస్తవ సమయ డేటాతో పని చేసే సామర్థ్యం సాధించడంపై దృష్టి సారించారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో (ఎస్‌డీఆర్) ఆధారిత పరీక్షా వేదిక ద్వారా వాస్తవ పరిసరాలలో ఈ అల్గోరిథంల పనితీరును పరీక్షించారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

ఐఎస్ఐ మార్కు ఉత్పత్తులనే వాడాలి



తడి పొడి చెత్తను వేరు చేసే విధానం వివరిస్తున్న శానిటరీ సెక్రటరీలు

పులివెందుల టౌన్ : కాఫీ, టీ పొడులను ఐఎస్ఐ మార్కు కలిగిన వాటినే వాడాలని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆయన వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలతో కలిసి పలు టీ, కాఫీ షాపులను తనిఖీ చేశారు. నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ కలిగిన టీ, కాఫీ పొడులనే వాడాలని షాపు యజమానులకు సూచించారు. అంతేకాక టీ షాపులల్లో ప్రజారోగ్యానికి హానికరమైన పేపర్ గ్లాస్‌లను ఉపగించరాదన్నారు. అనంతరం వార్డు సచివాలయ శానిటరీ సెక్రటరీలు స్థానిక నగరి గుట్టలో ప్రజలకు స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి పురపాలక చెత్త సేకరణ వాహనాలకు అందించే విషయంపై అవగాహన కల్పించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ హర్ ఘర్ తిరంగా ర్యాలీలో విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ - 3,12 ప్రోగ్రాం అధికారుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గురువారం 300 మంది విద్యార్థులు పాల్గొని క్యాంపస్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యానందం, గోవర్ధన్, అనిత, మగశిర అరుణ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పవన్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

పులివెందుల టౌన్ : భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం స్థానిక బాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఉదయం 7.30 గంటలకు జెండా వందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సర్వం సిద్ధం

లింగాల : మండలంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయనున్నారు.

పాఠశాల మార్చ్ ఫాస్ట్ కోసం డ్రమ్స్ వితరణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగడి వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మార్చ్ ఫాస్ట్ కోసం ఉపయోగించుకోవడానికి రూ.12000 విలువైన డ్రమ్స్‌ను అదే పాఠశాలలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సుకుమారి ఉచితంగా అందజేశారని ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

కమలాపురం : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. జెండా ఎగుర వేసేందుకు సచివాలయాలు, అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో జెండా ఎగుర వేసేందుకు వీఆర్ఏలు ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించారు.

నేడు మాంసం దుకాణాలు నిర్వహించరాదు

కమలాపురం : ఈ నెల 15వ తేదీన 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురం పట్టణంలో మాంసం దుకాణాలు నిర్వహించరాదని నగర పంచాయతీ కమిషనర్ ప్రహ్లాద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం చికెన్, మటన్ దుకాణాలు నిర్వహిస్తే రూ.5 వేలు జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మాంసం దుకాణాల యజమానులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ప్రతీకార రాజకీయాలతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

- రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో సీపీఐ నాయకుల నిరసన



రోడ్డుపై నిలిచిన నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వేంపల్లె : ప్రతీకార రాజకీయాలతో వేంపల్లెలోని ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా, ఆగి పోయిన రోడ్డు పనులను కూటమి నేతలు చేపట్టాలని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని పులివెందుల రహదారి గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లి -పులివెందుల ప్రధాన రహదారిపై అడ్డ రోడ్డు సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అసంపూర్తిగా రోడ్డు పనులు నిలిచి పోవడం జరిగిందని చెప్పారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో పాడు చేసిన సిమెంట్ రోడ్ల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అసంపూర్తిగా నిలిచి పోయిన రోడ్డు పనులను వెంటనే మొదలు పెట్టాలని కోరారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మొదలుపెట్టిన రోడ్ల పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 15 మాసాలు కావస్తున్నప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయం అన్నారు. రోడ్లు పనులు చేపట్టకపోవడం అనేది ప్రజల పైన వివక్షనేనని అన్నారు. అధికారంలోకి రాగానే వెంటనే అన్ని రోడ్లను పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణం అన్నారు. రోడ్లు పనులు చేపట్టక పోవడం వలన వర్షం కురిసినప్పుడల్లా ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ల వద్ద కమిషన్ల కోసం ఆరాటం వదిలి అభివృద్ధి పైన దృష్టి సారించాలని కోరారు. రోడ్డు పనులు చేయకపోతే ప్రజల మద్దతుతో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈశ్వరయ్య, వేంపల్లి మండల నాయకులు మల్లేష్, అంజనప్ప, సింహాద్రిపురం మండల కార్యదర్శి అమీర్ బాషా, బంధం ఈశ్వరయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చెత్తకుండి.. వేరే చోటికి మార్చండి



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చెత్తకుండి

జమ్మలమడుగు : పట్టణంలోని టీటీడీ నారాపుర స్వామి దేవాలయం సమీపంలో రోడ్డు మీదనే మున్సిపాలిటీ సిబ్బంది చెత్త కుండీని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దనే చెత్తకుండిని మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయడంతో.. స్థానిక ప్రజలతోపాటు, కూరగాయాల మార్కెట్‌కు చెందిన వారు వ్యర్థాలు ఇందులోనే వేస్తుండటం వల్ల కంపు కొడుతోంది. ఈ ప్రాంతంలో టిక్కాయచేను వీధి, ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రహదారి ఉన్నాయి. సాయంత్రం అయ్యే సరికి ఎక్కువ సంఖ్యలో ఈ కూడలిలో జనం జమ అవుతారు. దీంతో చెత్తకుండి నుంచి వచ్చే దుర్వాసన తట్టుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చెత్తకుండిని మరో ప్రాంతానికి మార్చాలని కోరాతున్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్యుల రాక

పులివెందుల : పులివెందులలోని డాక్టర్ ఈసీ గంగిరెడ్డి హాస్పిటల్ (దినేష్ మెడికల్ సెంటర్)కు శుక్రవారం చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వైద్యులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.45 నుంచి 1 గంట వరకు అందుబాటులో ఉంటారని వారు పేర్కొన్నారు. చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దాలు, కర్ణబేరికి రంధ్రం, చెవికమ్మ రంధ్రం జారిన కుట్లు వేయుట, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుట, ముక్కులో గడ్డలకు ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గడ్డలను శస్త్ర చికిత్స, స్వరపేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తలతిరుగుట తదితర సమస్యలకు చికిత్స చేస్తారని తెలిపారు. వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నంబరును సంప్రదించాలని వివరించారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : రక్తదానం సామాజిక బాధ్యతని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని భాష్యం పాఠశాలలో చైర్మన్ భాష్యం రామక్రిష్ణ, వైస్ చైర్మన్ హనుమంత రావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ ఆదేశాల మేరకు గురువారం ముందస్తు 79వ స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి సమక్షంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, ప్రిన్సిపల్ ఉమాదేవి, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇందులో పాఠశాల పేరెంట్స్ దాదాపు 40 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ మాట్లాడుతూ 18 నుంచి 60 ఏళ్ల వరకు ఆరోగ్యంగా ఉన్న వారెవరైనా ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. అనంతరం రక్తదానం చేసిన పేరెంట్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ వీరనారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, రక్తనిధి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు



ఉట్టి కొడుతున్న చిన్నారిపై నీళ్లు చల్లుతున్న విద్యార్థులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని సూర్య స్కూల్‌లో గురువారం కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు కృష్ణా గోపికల వేషధారణలు వేసి అలరించారు. అలాగే గోపికల వేషధారణలో ఉన్న బాలికలు ఉట్టి లాగుతుంటే.. చిన్ని కృష్ణుల వేషధారణలో ఉన్న బాలురు ఉట్టి కొట్టేందుకు ప్రయత్నించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కృష్ణ జయంతి గురించి ఉపాధ్యాయులు వివరించారు. చిన్నారులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు పంపిణీ చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

సింహాద్రిపురం : విద్యాహక్కు చట్టం ప్రకారం బలహీన వర్గాల కుటుంబాల్లోని పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లకు గాను (2025- 26 విద్యా సంవత్సరానికి) మిగిలిపోయిన సీట్లు కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు మండల విద్యాశాఖాధికారులు ఖాదర్ బాషా, శారదా ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతరుల కులాల్లోని బలహీన వర్గాలకు 4 శాతం, హెచ్ఐవీ, అనాథ, దివ్యాంగుల కేటగిరీ వారికి 5 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. బీసీ, మైనార్టీ, ఓసీల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.20 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో 1.44 లక్షల లోపు ఉండాలన్నారు. అర్హులు ఈ నెల 20వ తేదీ వరకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు.

వృద్ధులకు ఫిజియోథెరపీ ఉచితం



వైద్య సిబ్బందికి శిక్షణపై అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్టు

జమ్మలమడుగు : వృద్ధాప్యంలో ఉన్న వారికి ఫిజియోథెరపీ ఉచితంగా చేయడం జరుగుతుందని, దీనిపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గీత పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులపై స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఫిజియోథెరపీపై నర్సులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫిజియోథెరపీకి సంబంధించిన పరికరాలు పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించే విధానంపై నర్సులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రఫిక్‌బాషా, ఫిజియోథెరపీ సవియుల్లాఖాన్, డాక్టర్ కవిత, కరిమున్నిస్సా తదితరులు పాల్గొన్నారు.

20లోపు దరఖాస్తు చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచితంగా విద్యను అభ్యసించేందుకు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు నరసింహులు, అనిత ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్లు పూర్తి అయిన పిల్లలు 1వ తరగతిలో చేరేందుకు 25 శాతం అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మైనార్టీ, ఓబీసీ, ఓసీ వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలు అర్హులని తెలియజేశారు. జనన సర్టిఫికెట్, ఆదాయం, కులం, నివాస ధ్రువ పత్రాలు, ఆధార్‌కార్డు, అవసరమైతే దివ్యాంగ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫోటోలు దరఖాస్తుకు జతపరచాలని వివరించారు.